


ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

ఆపరేషన్ అవినీతి

అక్రమ దందాకు కేరాఫ్‌గా వైద్యారోగ్య శాఖ



- ప్రతి పనికి ఓ రేటు?
- మూడేళ్ల నుంచి గుట్టుగా సాగుతున్న వ్యవహారం
- సెలవుల్లో ఉండి కూడా వేతనాలు డ్రా
- పేమెంట్ చేస్తేనే పీజీకి అనుమతి
- ఫేస్ బయోమెట్రిక్ అప్రూవల్‌కూ మామూళ్లు
- ఓ ఉన్నతాధికారి, ముగ్గురు అధికారులే కీలకం
- రూ. కోట్లలో అక్రమ దందా
- తాజా బదిలీలతో తప్పించుకునే పన్నాగం?

వైద్యారోగ్య శాఖలో అవినీతి దందా కొనసాగుతోంది. ఈ శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి.. మరో ముగ్గురు అధికారులతో కలిసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రతి పనికో రేటుతో అక్రమార్జనకు తెర తీశారు. ఉద్యోగులు, వైద్యులు ఈ నలుగురి తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. ఏ పని కావాలన్న అమ్యామ్యాలు సమర్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే పోతే పోయింది అనుకొని వారు చెప్పినంత సమర్పించుకొని పనులు చేయించుకుంటున్నారు. వైద్యులు పీజీ చేయాలన్నా, సెలవులు కావాలన్నా, మరే పని అయినా సరే డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే పనులు సాగవు. వైద్యారోగ్య శాఖలో గుట్టుచప్పుడు కాకుండా ఇంత అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఆ నలుగురు వేరే ప్రాంతాలకు వెళ్లి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.



నంద్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖ అంటేనే ఎంతో కీలకమైనది. నంద్యాల జిల్లా వైద్యారోగ్య శాఖలో మాత్రం ఆపరేషన్ 'అవినీతి' కొనసాగుతోంది. ఆ శాఖపై పలు అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పైసలిస్తే తప్ప ఏ పనీ చేయడం లేదనే బాధిత వర్గాల ఆవేదన. ఫేస్ బయోమెట్రిక్ నుంచి అక్రమ డిప్యుటేషన్లు, అడ్డగోలు సెలవుల వ్యవహారం వరకు ఎక్కడిక్కడ ప్రతి పనికో రేటు పెట్టి అక్రమ వసూళ్లకు తెరలేపారనే విమర్శలు లేకపోలేదు. ఎవరైనా వైద్యులు పీజీకి వెళ్లాలన్నా.. విధుల్లో చేరే సమయంలో వారి ధ్రువపత్రాలను వెరిఫికేషన్‌కు పంపాలన్నా.. ఏదైనా సెలవులు మంజూరు చేయాలన్నా.. పైసలిస్తే తప్ప పనిచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మొత్తంగా ఈ వ్యహారంలో ఆశాఖ ఉన్నతాధికారితో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ముగ్గురు అధికారులు పాత్ర కీలకంగా ఉన్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. వీరిలో కొందరైతే మరీ దారుణం. ఏకంగా ఫోన్‌పేకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పలు రూపాల్లో అక్రమ దందా రూ. కోట్లలో సాగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరికీ చిక్కకుండా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు డిప్యుటేషన్ సదుపాయం లేకుండా చేశారు. కానీ.. ఇక్కడ ఆ శాఖ ఉన్నతాధికారి మాత్రం తనదైన శైలిలో ఎవరికీ చిక్కకుండా మూడేళ్లుగా అక్రమ వ్యవహారం సాగిస్తున్నారని తెలిసింది. వైద్యులు, ఉద్యోగులకు మౌఖికంగా (ఓరల్) అక్రమ డిప్యుటేషన్లు వేయడం. హోదాను బట్టి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో కొందరు వైద్యులు, ఉద్యోగులు సైతం అడ్డదారిలో సెలవులు పొంది విధులకు వెళ్లకుండానే వేతనాలు డ్రా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు అధికారికి ఆయా ఉద్యోగులు భారీగా నెలవారి మామూళ్లు అందజేస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. ఇదిలా ఉండగా.. జిల్లాలోని రెండు పీహెచ్‌సీలో డీడీవో పవర్ ఉన్న వైద్యులు.. అక్రమంగా జీతం పొందిన వైద్యులు, ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగినా సదరు ఉన్నతాధికారి చూసీచూడనట్లు వ్యవహరించి అక్రమార్కులకు అండగా నిలిచారనే ఆరోపణలున్నాయి.

డీడీవో ఓకే చేసిన వారినే అప్రూవల్ చేయాలి



జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో ఒక డీడీవో (వైద్యులు) ఉంటారు. అక్కడ పనిచేస్తున్న మిగతా వైద్యులతో పాటు వైద్యఉద్యోగులు, సిబ్బందికి సంబంధించి ప్రతిరోజు వారు వేసిన ఫేస్ బయోమెట్రిక్‌లు తమ పరిధిలో వేసి ఉంటేనే ఓకే చేయాలి. ఆ తర్వాత జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్న పర్యవేక్షణాధికారి(వైద్యులు) డీడీవో ఓకే చేసినా వారికి మాత్రమే (అప్రూవల్) చేయాల్సి ఉంది. కానీ.. సదరు పర్యవేక్షణాధికారి డీడీవో అప్రూవల్ చేయకపోయినా తానే అప్రూవల్ చేసి ఆయా ఉద్యోగుల నుంచి నెలవారిగా మామూళ్లు దండుకుంటున్నారని కొందరు డీడీవో వైద్యుల ద్వారా తెలిసింది.


మిగతా 6వ పేజీలో

కొణిదెల అభివృద్ధికి రూ.50 లక్షలు

- సొంత డబ్బు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- చెక్కును డీఆర్వోకు అందజేసిన కలెక్టర్ రాజకుమారి



డీఆర్వోకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి



నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామాభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ రూ.50లక్షలు తన సొంత నిధుల నుంచి మంజూరు చేశారు. ఇటీవల ఓర్వకల్లు మండలం జిల్లా పూడిచర్ల గ్రామంలో నీటికుంటల నిర్మాణ ప్రారంభ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే వినతిపై డిప్యూటీ సీఎం స్పందించారు. తమ సామాజిక బాధ్యతను చాటుతూ తమ ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పవన్‌కళ్యాణ్ స్వయంగా తన సొంత డబ్బు నుంచి రూ.50లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి చెక్కును జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, ఏవో రవికుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావుకు అందజేశారు. ఈడబ్బును గ్రామాభివృద్ధి పనులకు ఉపయోగించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తమ ఇంటిపేరుతో ఉన్న గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో డిప్యూటీ సీఎం డబ్బు ఇచ్చారన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలను కాపాడుతూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా నాలుగు నెలలలోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

పారదర్శకంగా బదిలీలు

- 101 మంది పోలీసులకు కౌన్సెలింగ్
- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసుల బదిలీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. మంగళవారం 101మంది పోలీసులను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందికి బదిలీ చేశామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీసు స్టేషన్ల ఖాళీలను చూపించి ఖాళీలకు అనుగుణంగా వారు కోరుకున్న స్థానాలకు సిబ్బందిని బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. సీనియారిటీ ఆధారంగా వారు కోరుకున్న చోటుకు స్థానచలనం చేశామన్నారు. ఒకే స్థానంలో ఐదేళ్లు పనిచేసిన వారి జాబితాను తయారు చేసి కౌన్సెలింగ్‌కు పిలిచామన్నారు. సిబ్బంది సంతృప్తి చెందినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, డీపీవో సూపరింటెండెంట్ ఖాదర్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు మోహన్‌రెడ్డి, సూర్యమౌళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

- వీసీలో కలెక్టర్ రాజకుమారి
- క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా దేశీయోత్పత్తి పెంపునకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కమ్యులేటివ్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-2026కు రూ.50,711కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందించాలన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం విశ్వకర్మ పథకాలకు బ్యాంకర్లు తప్పనిసరిగా చేయూతనివ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 485మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. జిల్లాలో వందశాతం పీఎం సూర్యఘర్ సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి నంద్యాల మండలంలోని పాండురంగాపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మహానంది మండలంలో సుగంధ అరటిపండ్లు ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసేందుకు నాబార్డుకు సహకారం అందించాలని సూచించారు. నల్లమల నన్నారి వేర్లతో చెంచులు షర్బత్ తయారుచేస్తున్నారని, వారు శిక్షణ తీసుకొని ఉపాధి పొందుతున్నారని వారికి అవసరమైన చేయూతను ఇవ్వాలని పేర్కొన్నారు. 2025-26కు సంబంధించిన వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను బ్యాంకర్లతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

నిర్జీవమవుతున్న నేల

- రసాయనాలతో సారం కోల్పోతున్న భూమి
- పెరిగిన రసాయన ఎరువుల వాడకం
- అవగాహనలేమితో నష్టపోతున్న రైతులు

6

నేడు నంద్యాలకు వైఎస్ షర్మిల

ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు

6

వేతన వెతలు

- ఉపాధి కూలీలకు ఇబ్బందులు
- జిల్లాలో రూ.89.05 కోట్ల బకాయిలు
- రోజుకు 50వేల మంది కూలీలు హాజరు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నంద్యాల టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కుటుంబ పోషణకు పని చేస్తున్న కూలీలకు వేతనం ఇవ్వడం లేదు. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనుల మీద ఆధారపడిన వారి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. జిల్లాలో సుమారుగా 50 వేల మంది హాజరవుతున్నవారి వెతలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నంద్యాల జిల్లాలో 498 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రోజుకు సుమారుగా 50 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. గత మూడు నెలల నుంచి జిల్లాలో రూ.89.05 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఎండ కాలం ముగిసిపోతున్నా పని స్థలాల్లో కనీస సౌకర్యాలు ఇప్పటికీ కల్పించడం లేదు. చివరికి వేతనాలు కూడా ఇవ్వడం లేదు.



- ఉపాధి పథకం కింద వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచేందుకు చెరువులు, పంట కాల్వల్లో పూడికతీత, ఇంకుడు గుంతలు, మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పశువుల దాహార్తి తీర్చడానికి తాగునీటి తొట్లు, కంపోస్టు పిట్‌లు తదితర పనులు కూడా జరుగుతున్నాయి. ఈ పనుల్లో శ్రమ చేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వడం లేదు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు కావడంతో గత మూడు నెలల నుంచి వేతనాలు అందక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నా మని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు మాత్రం ఏప్రిల్ 15 వరకు కొందరికి వేతనాలు వారి ఖాతాలో వేశామంటున్నారు. అయితే చాలా మందికి మార్చి నెల నుంచి వేతనాలు అందడం లేదు.
- నీటి తొట్లు, సాగునీటి కుంటలు, పంట కాల్వల పూడికతీత శ్మశాన వాటికలు, తోటల పెంపకం వంటి పనులు చేసిన వారికి మాత్రం వేతనాలు ఇచ్చారు. ఇతర పనులు చేస్తున్న వారికి వేతనాలు ఇవ్వడం లేదని కూలీలు అంటున్నారు. ఇప్పటి వరకు సుమారుగా రూ.89.05 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చాయి

ఇటీవలే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. సుమారుగా రూ. వెయ్యి కోట్లు వచ్చాయి. త్వరలోనే వేతనదారుల ఖాతాలో జమ అవుతాయి. ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ఏప్రిల్ 15 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే రిలీజ్ చేస్తాం.

- వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ, నంద్యాల

నిలిచిన వేసవి భత్యం

ఉపాధి హామీ పథకంలో పని చేసేవారికి గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 15 నుంచి 30 శాతం వేసవి భత్యం అదనంగా ఇచ్చేవారు. మూడేళ్ల నుంచి దీనిని తొలగించారు. పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగ కూడా అందించే వారు. గతంలో మాదిరిగా పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం, ఇతర సౌకర్యాలు సమకూరిస్తే పనుల్లోకి వచ్చే సంఖ్య పెరుగుతుందని కూలీలు అంటున్నారు.


పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 16 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు ఇచ్చినట్లు కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు. 11 మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులలో 9 మందికి రెగ్యులర్ ప్రమోషన్, ఇద్దరికి అడ్‌హక్ ప్రమోషన్, 4 గ్రామ పంచాయతీ సిబ్బందికి, డీపీవో కార్యాలయం సిబ్బందిలో ఒకరికి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3 ప్రమోషన్ కల్పించినట్లు తెలిపారు.

వైద్యశాఖలో బదిలీలకు కసరత్తు

కర్నూలు హాస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ల బదిలీలకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. జిల్లా క్యాడర్లకు సంబంధించిన ఉద్యోగుల బదిలీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. నంద్యాల జిల్లా నుంచి జాబితాను కొద్దిగా ఆలస్యంగా రావడంతో రెండు జిల్లాలతో కలుపుకుని ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ ఉద్యోగుల బదిలీలు నిర్వహించనున్నారు. డీఎంహెచ్‌వో పరిధిలోని 12 క్యాడర్లకు సంబంధించిన బదిలీల దరఖాస్తు జాబితా ఐదేళ్ల సీనియారిటీ జాబితా, క్లియర్ వేకెన్సీ లిస్టును బుధవారం ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. రీడిప్లాయ్‌మెంటు కింద పని చేస్తున్న 15 మంది ఏఎన్ఎం బదిలీలు వద్దని తమ దరఖాస్తులను వెనక్కు తీసుకున్నారు. ఉద్యోగుల జాబితా అనంతరం 13, 14, 15 గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఫైనల్ లిస్టు విడుదల చేసి బదిలీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

మహానంది ఆలయానికి బదిలీపై ఉద్యోగులు రాక



ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానానికి ఇతర ఆలయాల నుంచి ఏడుగురు ఉద్యోగులు బదిలీపై వస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. శ్రీశైలం ఆలయం నుంచి ఆరుగురు, అనంతపురం జిల్లా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఒకరు బదిలీపై వస్తున్నారన్నారు. శ్రీశైలం నుంచి పర్యవేక్షకురాలు గిరిజామణి, అసిస్టెంట్ ఇంజనీర్ బీవీ శివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు సదాశివరావు, ఎస్.అనురాధ, జూనియర్ అసిస్టెంట్లు వీవీఎస్ గణపతి, వి.లక్ష్మీనారాయణ, కసాపురం నుంచి సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటనారాయణ బదిలీపై మహానందికి ఆలయానికి వస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు.

మహానంది ఈవోకు అదనపు బాధ్యతలు

మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి నందవరం ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు కల్పిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల్లో నందవరం చౌడేశ్వరీదేవి ఆలయ ఈవోగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

తహసీల్దార్ల బదిలీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 8 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న బాలలక్ష్మయ్యను వెలుగోడుకు బదిలీ చేశారు. వెలుగోడు తహసీల్దార్ పోల్‌ను ఆత్మకూరుకు, ఆత్మకూరు తహసీల్దార్ విమలను నందికొట్కూరుకు బదిలీ చేశారు. అదేవిధంగా బేతంచెర్ల తహసీల్దార్ దేవదాస్‌ను మిడ్తూరుకు, సంజామల తహసీల్దార్ మద్దిలేటిని అవుకు మండలానికి, డోన్ తహసీల్దార్ మునిస్వామిని గడివేములకు బదిలీ చేశారు. బనగానపల్లె తహసీల్దార్ ఏవీ రామిరెడ్డిని దొర్నిపాడుకు, రుద్రవరం తహసీల్దార్ లక్ష్మిని శిరివెళ్ల తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన ఋణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 20.06.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 2-5-586,1 వ అంతస్తు,గుప్తాబిల్డింగ్స్,శ్రీనివాసనగర్,నంద్యాల,నంద్యాల జిల్లా-518501.

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
NADY1PJ2412030002	REKUKUNTLA RAJU	NADY1PJ2412280008	SURENDRA KOKILA
NADY1PJ2412070010	REKUKUNTLA RAJU	NADY1PJ2412300001	SHAIK MAHABOOB BASHA
NADY1PJ2412100001	REKUKUNTLA RAJU	BGNPLIP2412110001	MULLA KHAJA HUSSAIN
NADY1PJ2412200002	GALI LAKSHMI	BGNPLPJ2412160004	KAMMARA SUBHADRA
NADY1PJ2412270002	SHAIK MAHABOOB BASHA	BGNPLPJ2412310003	MEKALA VENKATA LAKSH-

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ T S VIJAY KUMAR ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 10.06.2025
స్థలం:నంద్యాల
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 20.06.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 1-9-817,1 వ అంతస్తు,జోగిరెడ్డి కాంప్లెక్స్,గౌడ్ సెంటర్,ఆత్మకూర్,నంద్యాల జిల్లా-518422.

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
ATKR1PJ2409140006	LINGALA ANKANNA	ATKR1PJ2412090002	E DEVENDRA GOUD
ATKR1PJ2409160002	MULLA KARISHMA	ATKR1PJ2412110001	BANDARU SARASWATHI
ATKR1PJ2409240010	BOGALA SREENIVASULU	ATKR1PJ2412160007	SYED MAHABOOB
ATKR1PJ2409300008	PASULA KAVITHA	ATKR1PJ2412200003	DANDUGULA PRAVN KUMAR

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ T S VIJAY KUMAR ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 10.06.2025
స్థలం:ఆత్మకూర్
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 20.06.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 8-869,LICఆఫీసు ఎదురుగ,KEమధన్న నగర్,డోన్,నంద్యాల జిల్లా-518222.

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
DHONBPJ2409200002	THAMMANA GARI ADINARAYANA	DHONBPJ2412130006	KURUVA CHANDRASEKHAR
DHONBPJ2409230003	BANGARU CHNADRA SANKHARAIAH	DHONBPJ2412160004	OSURU SURENDRA
DHONBPJ2409260001	SAMPANGI SUDHAKAR	DHONBPJ2412180002	BOYA BALU
DHONBPJ2412100003	BINGI UMA DEVI	DHONBPJ2412180005	BOYA SARASWATHI
		DHONBPJ2412180006	DUDEKULA ALI MOULALI
		DHONBPJ2412180013	BOYA BALU

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ T S VIJAY KUMAR ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 10.06.2025
స్థలం:డోన్
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఇంజనీరింగ్ అధికారుల బదిలీలు

ఐదేళ్లు కాకుండానే స్థాన చలనం

కర్నూలు న్యూసిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నగరపాలక, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజనీర్లను బదిలీ చేస్తూ చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమలోని అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు సంబంధించి డీఈఈ, ఏఈఈలకు సాధారణ బదిలీలు నిర్వహించారు. ప్రధానంగా డీఈఈ శ్రీనివాసరెడ్డి గత సంవత్సరం జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు కార్పొరేషన్‌కు వచ్చారు. అయితే ఏడాది తిరగకముందే ఆయనను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. అదే విధంగా ఆదోని మున్సిపాలిటీలో పని చేస్తున్న జనార్ధన్ కూడా గతేడాది నగరపాలక నుంచి ఆదోనికి వెళ్లారు. అయితే మరోసారి సాధారణ బదిలీల్లో సంవత్సరం కాక ముందే నగరపాలక సంస్థకు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిలో డీఈఈ, ఏఈఈలు నగర పాలక సంస్థలో ఎవరూ లేరు. ప్రజాప్రతినిధులు సిఫారసుల మేరకు కావాల్సిన వారిని బదిలీ చేసినట్లు సమాచారం.

పేరు	ప్రస్తుతం	బదిలీ
డీఈఈలు		
ఆర్. రాజశేఖర్	ఆదోని మున్సిపాలిటీ	ఏపీ టిడ్కో, విజయవాడ
జి. శ్రీనివాసరెడ్డి	కార్పొరేషన్, కర్నూలు	పులివెందుల మున్సిపాలిటీ
కే. చంద్రయ్య	పులివెందుల మున్సిపాలిటీ	నంద్యాల డీపీహెచ్‌ఈవో
ఎస్. కావ్య	నంద్యాల డీపీహెచ్‌ఈవో	కడప పబ్లిక్ హెల్త్ డివిజన్
జి.వి. వరప్రసాద్	పబ్లిక్ హెల్త్ డివిజన్, కడప	ఎమ్మిగనూరు మున్సిపాలిటీ
జి. విక్టర్‌బాబు	ఎమ్మిగనూరు మున్సిపాలిటీ	ఏపీ టిడ్కో, కర్నూలు
ఏఈఈలు		
ఎస్. భార్గవి	కార్పొరేషన్, కర్నూలు	ఆదోని మున్సిపాలిటీ
కే. జనార్ధన్	ఆదోని మున్సిపాలిటీ	కార్పొరేషన్, కర్నూలు
వి. నాగజ్యోతి	కార్పొరేషన్, కర్నూలు	తిరుపతి కార్పొరేషన్
కే. గోవిందప్ప	కార్పొరేషన్, కర్నూలు	గుత్తి మున్సిపాలిటీ
ఈ. ప్రవీణ్‌కుమార్	కార్పొరేషన్, కర్నూలు	కడప కార్పొరేషన్
వి. అంజలి	కడప కార్పొరేషన్	కార్పొరేషన్, కర్నూలు
బి. బ్యూలా	ప్రొద్దుటూరు మున్సిపాలిటీ	ఆదోని మున్సిపాలిటీ
యు. శ్రీనివాస్	డీపీహెచ్‌ఈవో, నంద్యాల	పబ్లిక్ హెల్త్, గుంతకల్లు

జడ్పీ పరిధిలో 9 మంది బదిలీ

కర్నూలు న్యూసిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు 9మందిని బదిలీచేస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఇద్దరు ఎంపీడీవోలు, ఇద్దరు పరిపాలనా అధికారులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక రికార్డు అసిస్టెంటు, ఒక నాలుగో తరగతి ఉద్యోగిని బదిలీ చేయడంతో పాటు, ఒక టైపిస్టును అదే స్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నగర పాలక సంస్థలో ఆడిటర్ మురళి బదిలీ: నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఆడిటర్ మురళిని తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరు వెంటనే బదిలీ స్థానాల్లో చేరాలని పేర్కొన్నారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు..

కర్నూలు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేశారు. మంగళవారం రాత్రి డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈక్రమంలో రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు డి.మునిస్వామిని పంచలింగాల చెక్‌పోస్టుకు , టీఎస్ ప్రసాదరావును మాధవవరం చెక్ పోస్టుకు, వి.విజయకుమార్‌ని ఆళ్లగడ్డకు, డి విశ్వేశ్వరరావును పంచలింగాల చెక్‌పోస్టుకు, ఆర్. స్వర్ణలతని పత్తికొండకు, ఈ. మోహన్‌రెడ్డిని ఆత్మకూరుకు, వై.సతీష్‌ని బనగానపల్లెకి బదిలీపై నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు

నేడు నంద్యాలకు వైఎస్ షర్మిల

- రేపు నాయకులు, కార్యకర్తలతో సమావేశం
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నంద్యాలకు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ పేర్కొన్నారు. నంద్యాల మండలంలోని చాబోలు గ్రామ సమీపంలో షర్మిల బస చేయనున్న ఎయస్‌ఆర్ కల్యాణ మండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సూరజ్ గ్రాండ్ హోటల్‌లో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో పాల్గొనేందుకు అన్నిరకాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిల బుధవారం సాయంత్రం 6 గంటలకు కర్నూలులో బయలుదేరి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాల సమీపంలోని ఎయస్‌ఆర్ కల్యాణ మండపానికి చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నట్లు తెలిపారు. 12వ తేదీ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి చాకలి పుల్లయ్య, పట్టణాధ్యక్షుడు దాసరి చింతలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అబ్రహం పఠాన్ సలీం, ఖాజా శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఏరువాక సాగాలో..



- మన సంస్కృతి, జీవన విధానానికి మూలస్తంభం వ్యవసాయం
- ఏరువాకతో యజ్ఞంలా వ్యవసాయ పనులు ఆరంభం
- నాగరికతకు చిహ్నంగా 'నాగలి'
- రైతు పండుగగా గుర్తింపు
- నేడు ఏరువాక పౌర్ణమి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పంచభూతాల్లో ఒకటైన ప్రకృతిని దైవంగా ఆరాధించడం మన సంప్రదాయం. మన సంస్కృతికి, జీవన విధానానికి వ్యవసాయం మూలస్తంభం లాంటిది. నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా రైతుకు నాగలి లేనిదే మనుగడ లేదు. ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించడం, వ్యవసాయ పనుల ఆరంభానికి ముందు పూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. జ్యేష్ట పౌర్ణమి రోజున వచ్చే రైతు పండుగయే ఏరువాక పౌర్ణమి. ఏరు అంటే నాగలి, వాక అంటే దున్నడం అని అర్థం. జ్యేష్ట పూర్ణిమ(ఏరువాక పూర్ణిమ) రోజున వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు ముందుగా ఎడ్లను కడిగి కొమ్ములకు రంగులు వేసి వాటిని అందంగా అలంకరించి పూజిస్తారు. అనంతరం నాగలితో పొలంలోకి వెళ్లి దుక్కిని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

నైరుతి రుతుపవనాల రాకతో...

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడం, వర్షాలు కురవడంతో భూములు పదునెక్కాయి. దీంతో ఏరువాక పౌర్ణమి కోసం రైతులు ఎదురు చూస్తూ విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాలతో అరక దున్ని వ్యవసాయ పనులు పెట్టారు. నాగలిని ధైర్యానికి, కష్టపడే మనస్తత్వానికి ప్రతీకగా, ఎద్దులు, ఇతర పనిముట్లు రైతు శక్తిసామర్థ్యాలను నైపుణ్యానికి చిహ్నాలుగా భావిస్తారు.

వృషభ పూజ

ఏరువాక పున్నమిని వృషభ పూజగా కూడా పిలుస్తారు. పాలిచ్చే గోవులకు పసుపు, కుంకుమతో పూజించడం, పనిచేసే బసవన్నకు పత్రి, పుష్పం సమర్పించి, అందంగా అలంకరించి హారతులు పట్టడం మన సంస్కృతిలో భాగంగా వస్తోంది. తొలిదుక్కి సమయంలో రైతులు కాడికి ఒక పక్కన ఉంటూ ఎద్దులతో సమానంగా నడుస్తారు. తమ జీవనంలో కూడా తమకు అండగా ఉంటున్న మూగజీవాల పట్ల అభిమానాన్ని చాటుతారు. పశువులతో ఊరేగింపులు నిర్వహించడం, ఆలయాల ప్రదక్షిణ చేయించడం చాలా చోట్ల ఆనవాయితీగా వస్తోంది.



క్రీడలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- క్రీడలంటే ఎంతో ఇష్టం
- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తే వాటి ద్వారా వచ్చే ప్రశంసాపత్రాలతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఏపీ క్యాంపులో ఏర్పాటు చేసిన వేసవి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీఎస్‌పీ సెకండ్ బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్‌తో కలిసి ఆయన గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తనకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. బాలుర విభాగంలో ఈగల్ జట్టు గెలుపొందగా బాలికల విభాగంలో లేకర్స్ జట్టు విజయం సాధించింది. బాలుర జట్టులో ద్వితీయ స్థానంలో బుల్స్ నిలవగా.. బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో హుప్‌స్టార్ జట్లు నిలిచాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దాదాబాషా, ముస్తాహీర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు పాండురంగారావు, వినయ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ దంపతులు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ డీఎస్ ఫీటర్స్



ఎన్‌సీసీ కేడెట్స్‌కు సూచనలిస్తున్న కల్నల్ డీఎస్ ఫీటర్స్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ అలవడుతుందని ఆ సంస్థ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ డీఎస్ ఫీటర్స్ అన్నారు. కర్నూలులోని 28(ఏ) ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహిస్తున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాలోని వివిధ విద్యాసంస్థల నుంచి దాదాపు 550 మంది కేడెట్స్ హాజరయ్యారు. 10రోజులపాటు నిర్వహించే ఈ క్యాంపును సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, స్నేహభావం కలుగుతుందని అన్నారు. కల్నల్ టీఎస్ ప్రసాద్, లెఫ్టినెంట్ కల్నల్ జి.శశికుమార్, సహాయ కమాండెంట్ ఆఫీసర్లు రఘురాం, కామ్మీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్జీవమవుతున్న నేల

- రసాయనాలతో సారం కోల్పోతున్న భూమి
- పెరిగిన రసాయన ఎరువుల వాడకం
- అవగాహనలేమితో నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయశాఖ



సహజత్వాన్ని కోల్పోయి తెల్లబారుతున్న నేలలు

కొలిమిగుండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గేదెల పేడ .. మేకల ఎరువు .. నల్లమట్టి .. కోళ్లపెంట .. కుళ్లిన మొక్కలు .. ఇలాంటి సేంద్రియ ఎరువులే ఒకప్పుడు పంటల సాగులో ప్రధానంగా ఉండేవి. భూముల్లో సేంద్రియ కర్బనం ఉత్పత్తి ఎక్కువగా ఉండేది. కార్బన్-నత్రజని 1:4 శాతంలో సమతుల్యతగా ఉండేది. జీవసంబంధమైన వానపాము, సాలెపురుగు, ఆరిద్ర పురుగు, కందిరీగ, తూనిగ, సీతాకోకచిలుక, రైజోబీయం బ్యాక్టీరియా తదితర అనేక జీవులు భూమిలో భూసారాన్ని వృద్ధి చేయడంతో పాటు, మొక్కలపై జీవిస్తూ పంటలను చీడపీడలబారి నుంచి సంరక్షిస్తూ తోడ్పాటునందించేవి. అధిక పోషక విలువలతో పంట దిగుబడి బాగా ఉండేది. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆహార పంటల ఉత్పత్తి పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధిక దిగుబడే ప్రధాన లక్ష్యంగా రసాయన ఎరువుల ప్రాధాన్యం పెరిగింది. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం పెరగడంతో భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. నేల నిర్జీవమవుతోంది. ఫలితంగా వ్యవసాయం గాడి తప్పింది. రైతులకు అవగాహన కల్పించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన ఎక్కడ..?

వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం పెంచి, పెట్టుబడి ఖర్చులు తగ్గించాలని ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం కానరావడం లేదు. పొలంబడి, రైతు చైతన్యయాత్రలు, సాగుకు సమాయత్తం, రైతు భరోసా కేంద్రాలు, రైతు అవగాహన సదస్సులు మొదలైన వాటిని అధికారులు మొక్కుబడిగా ముగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాల నిర్దేశిత లక్ష్యాలు ఏమాత్రం నెరవేరడం లేదు. ఉమ్మడి జిల్లాలో నేటికీ 20 శాతం మంది రైతులు కూడా భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయడంలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమవుతోంది. కొంత మంది రైతులు అరకొరగా మాత్రమే పశువుల పేడ, నల్లమట్టి లాంటి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైతులకు సేంద్రియ ఎరువులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రసాయన ఎరువులతో నష్టాలు: అతిగా రసాయన ఎరువుల వాడటం వల్ల కాలక్రమేణా మేలు చేసే సూక్ష్మజీవులు అంతరించి పోతున్నాయి. తద్వారా దుష్ఫలితాలు కలుగుతున్నాయి. పంటలకు చీడపీడలు వ్యాపించి, పండే పంటలు సైతం కలుషితంగా మారుతున్నాయి. ఇలాగే రసాయన ఎరువుల వాడకం పెరిగితే భవిష్యత్తులో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు: సేంద్రియ ఎరువుల వల్ల నేలలు సహజత్వాన్ని కోల్పోవు. నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. మొక్కకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభ్యమవుతాయి. పోషకాల సమతుల్యత దెబ్బతినదు. పలురకాల ఎంజైములు, హార్మోన్లు, అమైనో ఆమ్లాలు తయారై మొక్క చురుకుగా పెరుగుతుంది. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.



పొలంలో సేంద్రియ ఎరువు వేస్తున్న మహిళా రైతులు

ఆపరేషన్ అవినీతి



సుమారు 45 మంది వైద్యులు పీజీకి వెళ్లినట్లు సమాచారం. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ. 40వేలు నుంచి రూ.50 వేలు వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొందరి నుంచి అక్కడ పనిచేస్తున్న ఓ అధికారికి చెందిన ఫోన్‌పే చేయించుకోవడం గమనార్హం. పెండింగ్ ఏరియర్స్, సర్వీస్ మ్యాటర్స్ తదితర విషయాల్లో సైతం సదరు అధికారి తమదైన శైలిలో వసూళ్లు చేసి క్యాష్ చేసుకుంటున్నారని సమాచారం. ఈ లావాదేవీల్లో సదరు ఉన్నతాధికారికి ఎక్కువశాతం వాటా చేరుతోందని తెలిసింది

5వ పేజీ తరువాయి

దీంతో ఇదే అదునుగా భావించిన వైద్యులు, ఉద్యోగులు సైతం మామూళ్లు ఇస్తున్నాం కదా.. అని..? ఎక్కడపడితే అక్కడే ఫేస్ బయోమెట్రిక్ వేస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు విధులకు వెళ్లడం, కొన్ని సందర్భాల్లో అనుమతి లేకుండా డుమ్మా కొట్టడం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా వారి జీతాల్లో మాత్రం కోతలు పడటం లేదు. ఈ రూపంలో కూడా నెలకు సదరు పర్యవేక్షణాధికారి ద్వారా ఆశాఖ ఉన్నతాధికారికి సైతం భారీగానే నెలవారీ మామూళ్లు ముడుతున్నాయని తెలుస్తోంది.

స్థాయిని బట్టి..

ఉద్యోగుల పరంగా ఉద్యోగాన్ని బట్టి వారి ఎస్‌ఆర్‌ల కోసం రూ. 10 వేలు నుంచి రూ.20 వేలు. ఇదే క్రమంలో వివిధ వెరిఫికెషన్ రూపంలో ఒక్కొక్కరి నుంచి స్థాయిని బట్టి రూ.10వేల నుంచి రూ. 15వేలు వసూలు చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికీ కొందరి ఎస్‌ఆర్‌లు సక్రమంగా లేవని తెలుస్తోంది. ఇదేతరహాలో మెటర్నిటీ లీవ్‌లకైతే రూ. 15వేలు సమర్పించాల్సిందే అనే చర్చ సాగుతోంది. క్యాజువల్ లీవ్‌కు సైతం వదలకుండా స్థాయిని బట్టి వసూళ్లు చేస్తున్నారని తెలిసింది. వీటికితోడు కొన్ని పీహెచ్‌సీలకు సంబంధించిన హెచ్‌డీఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించి రూ.లక్షల్లో స్వాహా చేశారనే ఆరోపణలు లేకపోలేదు.

పైసలిస్తేనే రిలీవ్..

జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు ఎంబీబీఎస్ చేసినవారే ఉన్నారు. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులుకు పీజీలకు అవకాశం వస్తే.. ఇదే అదునుగా భావించిన సదరు అధికారులు పైసలిస్తే తప్ప.. ఆవైద్యులను విధుల నుంచి రిలీవ్ చేయలేదని పలువురు వాపోతున్నారు. మూడేళ్లలో జిల్లాలో

సార్ ఆదేశిస్తారు.. వారు అమలు చేస్తారు..

అక్రమ వసూళ్ల దందా వెనుక ఓ ఉన్నతాధికారితో పాటు అక్కడే పనిచేసే మరో ముగ్గురు అధికారులు పాత్ర కీలకంగా ఉందని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. సార్ ఆదేశించడం.. వారు అమలుచేసి వచ్చిన అమ్యామ్యాలను గుట్టుచప్పుడుగా ఉన్నతాధికారికి చేరవేస్తున్నట్లు సమాచారం. ఎప్పుడైనా.. ఎవరైనా ఇవ్వకపోతే.. ఏదో రకమైన వసులు.. సమస్యల మీద కార్యాలయానికి పిలిపించడం.. ఆ తర్వాత ఆ ముగ్గురు కథ నడుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. వీరే కాకుండా జిల్లాలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న కొందరు యూడీసీల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

బదిలీల్లో తప్పించుకోవాలనే...

సదరు ఉన్నతాధికారితో పాటు కీలకంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులు. సదరు వ్యవహారాలకు సహకరించిన ఉద్యోగులు సైతం భవిష్యత్‌లో సేఫ్‌గా ఉండాలనే యోచనతో తాజా బదిలీల రూపంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎవరికి వారు తమదైన శైలిలో పైరవీలు మొదలెట్టినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మూడేళ్లుగా సాగిన అవినీతి ఆరోపణలపై ఆశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి లోతుగా విచారణ చేస్తే.. సదరు అధికారులు అక్రమ దందా..! బయటపడే అవకాశం లేకపోలేదని సమాచారం.

ఉన్నతాధికారులు వస్తే హడావిడి..

తాను చేసిన వ్యవహారం ఏమాత్రం బయటపడకుండా తెరవెనుక కథ నడిపారని ఆశాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. మూడేళ్లుగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు. అక్రమ వ్యవహారం అంతా కూడా తమ వద్ద పనిచేస్తున్న ఆ ముగ్గురు కీలక అధికారుల ద్వారా నడిపించారనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఆ ముగ్గురి అకౌంట్లతో పాటు ఫోన్ కాల్స్ రికార్డులను పరిశీలించినా అసలు విషయాలు బయటపడే అవకాశం ఉందని సమాచారం. లేదంటే పీజీల కోసం బయటకు వెళ్లిన వైద్యులు.. కొత్తగా విధుల్లో చేరిన వైద్యులు, వైద్య ఉద్యోగులను అడిగినా కూడా ఇట్టే తెలిసిపోతుంది. తాను చేసిన తప్పులు బయటకుండా ఆశాఖ ఉన్నతాధికారులు, మంత్రులు, కలెక్టర్లు వచ్చిన సమయంలో సదరు ఉన్నతాధికారి నానా హడావిడి(వివిధ రూపాల్లో) చేసి వారి నుంచి సమస్య తలెత్తకుండా చూసుకోవడంలో సదరు అధికారి దిట్ట అనే ప్రచారం ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు.

వసతి గృహాల నిర్వహణపై న్యాయాధికారి ఆగ్రహం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండు వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సాయి అనాథ ఆశ్రమాన్ని ఆయన తనిఖీ చేసిన సమయంలో వాటి నిర్వహణను పరిశీలించి ఆగ్రహం వ్యక్తంచేశారు. వసతి గృహంలో సరైన రికార్డులు లేవని, పరిశుభ్రతను పాటించడం లేదని అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనాథ ఆశ్రమానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయక పోవడంపై అక్కడి సిబ్బందిని మందలించారు. ఆ తర్వాత ఆయన స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని కూడా పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి వారికి అందించే భోజన వసతి సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, పారా లీగల్ వలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ డీసీపీవో శారద, తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు న్యాయవాది గురురాజరావుపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ తమ విధులను బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

కిషోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల

కర్నూలు హాస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల అన్నారు. కల్లూరు మండలం లక్ష్మీపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిషోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి.శారద మాట్లాడుతూ కిషోర బాలికల వికాసానికి పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలకు 18 సంవత్సరాలు నిండేవరకు వివాహం చేయమని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అబ్బాయిలకు, అమ్మాయిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ అనూరాధ, సూపర్‌వైజర్ జమీల, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అవుకు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిదిడ్డి వీధికి చెందిన కాటికాళ్ల లక్ష్మీదేవి (56) మంగళవారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీదేవి భర్త పెద్ద పుల్లయ్య అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం మృతిచెందడం, ఇద్దరు కొడుకులకు వివాహం కాకపోవటంతో మనస్తాపంచెంది లక్ష్మీదేవి ఇంట్లోనే విషద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి 108లో అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. రెండో కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో మరొకరు..

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటరమణ(38) చాలా కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. మంగళవారం భార్య అనురాధతో కలిసి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వచ్చాడు. భార్య డాక్టర్ల వద్దకు వెళ్లగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న వెంకటరమణ పురుగుల మందు తాగాడు. వైద్య సిబ్బంది వెంటనే ఆస్పత్రిలోకి తరలించి చికిత్స చేసినా ఫలితం లేకపోయింది మృతుని భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అప్పులు అధికమై రైతు బలవన్మరణం

- రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎమ్మెల్యే విరుపాక్షి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌సెట్లో రైతు బోయ చిన్నబాబయ్య(ఫైల్)

ఆలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుళేబీడు గ్రామానికి చెందిన రైతు చిన్న బాబయ్య(63) అప్పుల బాధ తాళలేక మంగళవారం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. బంధువులు ఆయనను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. చిన్న బాబయ్య తన ఏడెకరాల పొలంలో గత యేడాది మిరప, పత్తి సాగు చేశాడు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఈ ఖరీఫ్‌లో పంట సాగు చేసేందుకు చిల్లిగవ్వ కూడా చేతికి రాలేదు. అప్పులు ఎలా చెల్లించాలో తెలియక పురుగుల మందు తాగాడు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షలు, వడ్డీ వ్యాపారుల దగ్గర మరో రూ.8 లక్షలు అప్పు ఉన్నదని, తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మృతుడి భార్య అంబమ్మ వేడుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

అప్పుల బాధతో మృతి చెందిన రైతు బాబన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే ఇలా ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. **- విరుపాక్షి, ఎమ్మెల్యే**

పురుగుమందు తాగి హెడ్ కానిస్టేబుల్..



వెంకటేశ్వర్లు (ఫైల్)

కర్నూలు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఓ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు (55)గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓలాడ్జీలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా సిబ్బంది గమనించి బంధువులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలతోనే ఈ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. తర్వాత సివిల్‌కు కన్వర్టు అయ్యాడు. ప్రస్తుతం కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతరు సంతానం ఉన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం

నంద్యాల టౌన్, జూన్10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 4వ తేదీన ఎస్బీఐ కాలనీలో ఉన్న ఎంఆర్ ఆసుపత్రిలో పంటి వైద్యం కోసం వెళ్లి చికిత్స వికటించి జావీద్ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఆ రోజున బంధువులు ఆందోళనలు చేసి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి వారి సంప్రదాయం ప్రకారం పూడ్చారు. కానీ రెండు రోజుల క్రితం మృతుడి కూతురు షాజీదా రెండో టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మంగళవారం రెవెన్యూ పోలీసు, వైద్య అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆలస్యంగా పోస్టుమార్టం నిర్వహించడంపై ఉత్కంఠ నెలకొంది. త్వరలో పోస్టుమార్టం వివరాలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వైద్యుడు అనిల్, టూ టౌన్ ఎస్ఐలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన భరద్వాజ్(20) అనే యువకుడు మంగళవారం అదృశ్యమయ్యాడు. యువకుడు రైలు నెంబర్.17252 కాచిగూడ నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో డోన్‌కు ప్రయాణిస్తుండగా.. అదృశ్యమైనట్లు తెలుస్తోంది. జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి మాట్లాడుతూ యువకుడి ఆచూకీ తెలిస్తే భరద్వాజ్ తండ్రి సెల్ నెం.7075659850, ఆర్‌పీఎస్ఐ నెంబర్. 9030481295 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

ఇంటిల్లిపాది అటువైపే

- పొలాల్లోనే వంటావార్పు
- వాహనాల్లో వస్తున్న ఆశావహులు
- పత్తికొండ, తుగ్గలి, మద్దికెరలో వజ్రాల కోసం అన్వేషణ

ఓ వజ్రం దొరకపోతుందా! తుగ్గలి మండలం జొన్నగిరి పొలాల్లో వజ్రాల వేట





వెతకాలంటే తినాలి కదా మరి..



నువ్వు బొజ్జో నాన్నా..

తుగ్గలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడితే చాలు ప్రతి ఒక్కరూ వేట షురూ చేస్తారు. అది మామూలు వేట కాదు... వజ్రాల వేట. వర్షం తమకు అదృష్టాన్ని తీసుకొస్తుందా? లేదా? అని ఆశగా చూస్తుంటారు. సాధారణంగా వర్షాకాలం మొదలైందంటే అన్నదాతలు ఆకాశం వైపు చూస్తారు. చినుకు పడితే చాలు వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ అక్కడ మాత్రం రైతులతో పాటు సామాన్య ప్రజలు, ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తుంటారు. వరుణ దేవుడి రాక కోసం ప్రార్థనలు చేస్తారు. ఒక్క తొలకరి వర్షంతో లక్షాధికారులు, కోటీశ్వరులు అయిపోవాలనే ఆశతో వజ్రాల అన్వేషణ చేస్తుంటారు. తొలకరి వర్షాలతో భూ ఉపరితలంపై ప్రత్యక్షమయ్యే వజ్రాల కోసం పత్తికొండ, తుగ్గలి, మద్దికెర ప్రాంతాలకు వేలాదిమంది తరలి వస్తుంటారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్ నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సైతం ఈ వజ్రాలను వెతికేందుకు కార్లు, ప్రత్యేక వాహనాల్లో ఆశగా వస్తున్నారు.

పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి, మద్దికెర మండలాల పరిదిలోని ఎర్రగుడి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, పగడిరాయి, అమినాబాద్, తుగ్గలి, మదనంతపురం, పెరవలి పంటపొలాల్లో విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. వజ్రాలు దొరుకుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో నంద్యాల, తాడిపత్రి, అనంతపురంతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా వజ్రాన్వేషకులు ఇక్కడకు వచ్చి అన్వేషిస్తున్నారు.

ఈ ఏడాది వేల సంఖ్యలో వజ్రాన్వేషకులు ఆటోలలో, కార్లలో ఇంటిల్లిపాది వచ్చి అన్వేషిస్తున్నారు. వచ్చిన వారు దాదాపు నెల రోజులు, వారం రోజులకు సరిపడా బియ్యం, సరుకులు తీసుకుని వచ్చి ఇక్కడే పొలాల్లోనే వంట చేసుకుంటూ వజ్రాల కోసం వెదుకు లాట ప్రారంభించారు. కొందరు చిన్నారులతో పాటు రావడంతో వారికి వారి వాహనాల్లోనూ, చెట్లకు ఊయల ఏర్పాటు చేసి నిద్రపుచ్చుతున్నారు.

- ఈ విషయంపై వజ్రాన్వేషితుల నుంచి వివరణ కోరగా.. పనులేమీ లేక అప్పుల బాధ నుంచి బయట పడాలని, ఇంటిల్లి పాది వచ్చామని, ఇక్కడ హోటల్‌లో భోజనం చేస్తే అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుందని, బియ్యం, బేడలు తెచ్చుకుని వంట చేసుకుని తింటున్నామని చెప్పారు. ఒక వజ్రం దొరికితే తమ జీవితాలు మారుతాయని వేలాది మంది ఆశావహులు ఎంతో ఆశతో వజ్రాన్వేషణ చేస్తున్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

- గంటన్నర వ్యవధిలో మూడుచోట్ల చైన్ స్నాచింగ్‌లు
- అప్రమత్తమైన పోలీసులు
- ముమ్మర గాలింపు చర్యలు



కర్నూలు క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. మంగళవారం ఒక్కసారిగా రెచ్చిపోయారు. గంటన్నర వ్యవధిలోనే మూడు చోట్ల స్నాచింగ్ చేశారు. మొదట తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పుల్లయ్య కాలేజీ సమీపంలో అపూర్వ వెంచర్ వెనుకాల లక్ష్మీదేవి అనే ఉపాధ్యాయురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు అపహరించారు. ఈమె బ్రాహ్మణకొట్కూరులో టీచర్‌గా పనిచేస్తుంది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నిత్యావసర సరుకుల కోసం రోడ్డుపైకి వచ్చి తిరిగి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగలు మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించారు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది.

ఈ సంఘటన జరిగిన అరగంటకే త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటాద్రినగర్‌లో యశోద అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకుని పరారయ్యారు. ఆమె తన ఇంటి ముందు నిల్చుని ఉండగా ఫ్యాషన్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు చటుకున్న ఆమె మెడలోని గొలుసు తెంపుకుని ఉడాయించారు. అపహరణకు గురైన గొలుసు విలువ సుమారు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన జరిగిన గంట సేపటి వ్యవధిలోనే నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంతోష్ నగర్‌లో భాగ్యలక్ష్మి అనే మహిళ మెడలోని నుంచి చైన్ లాగేశారు. ఈమె సంతోష్‌నగర్ లోని రోడ్డు నెంబరు 6లో మసీదు సమీపంలో తన బాడుగ ఇంటి నుంచి సొంతింటికి వెళ్తుండగా.. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని గొలుసు తెంపుకుని ఉడాయించారు. బాధితురాలు తేరుకుని కేకలు వేసేలోపే ఆ యువకులు పరారయ్యారు. నగరంలో మూడు చోట్ల స్నాచింగ్‌లు జరగడంతో పోలీసులు ఒక్కసారిగా ఉలికిపడ్డారు. వెంటనే అప్రమత్తమై పలు చోట్ల గాలించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆగంతకుల ఆచూకి కోసం గాలిస్తున్నారు.

నిజాయితీ చాటిన ఆ ముగ్గురు..

- నగదు, నగల బ్యాగ్ పోలీసులకు అప్పగింత
- బాధితులకు అందజేసిన రూరల్ ఎస్ఐ



నగలు, డబ్బును బాధితులకు అప్పజెప్పుతున్న రూరల్ ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఒక్క రూపాయి దొరికినా వదలని వాళ్లు ఉన్నారు. అలాంటి ఏకంగా లక్షల విలులైన ఆభరణాలు, నగదు ఉన్న సంచి రోడ్డు మీద దొరికినా నిజాయితీగా పోలీసులకు అప్పగించారు ఆ ముగ్గురు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరుకి చెందిన సోహెల్‌బేగ్, వలి, పెద్దకడుబూరుకి చెందిన కురువ నరసింహులు పనినిమిత్తం ఆదోనికి వెళ్తున్నారు. మండలంలోని బోడబండ గ్రామ సమీపాన మెయిన్‌రోడ్డుపై వారికి ఓ బ్యాగ్ దొరికింది. అది తెరిచిచూడగా అందులో రెండు బంగారు బిస్కెట్లు, నల్లపూసల బంగారు దండ, రెండు పొరల బంగారు దండ, బంగారు నెక్లెస్ దండ, చెవిచుట్లు, బ్రాస్లెట్, ఒక జత కమ్మలు, వెండి చైన్లుతో పాటు సుమారు రూ.2.50లక్షల నగదు, దుస్తులు ఉన్నాయి. ఎవరో బ్యాగ్‌ను పోగొట్టుకున్నారని గమనించిన వారు వెంటనే ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుకు బ్యాగ్‌ను అప్పజెప్పారు. అదే సమయంలో నందవరానికి చెందిన కురువ లలిత భర్త, చంద్రగుప్త ఆదోని నుంచి వచ్చి తమ బ్యాగ్ పోయిందని తెలిపారు. పోలీసులు విచారించి ఆ బ్యాగ్ లలిత, చంద్రగుప్తలదని నిర్ధారించుకున్నారు. బాధితులకు ఆ ముగ్గురి సమక్షంలోనే ఎస్ఐ శ్రీనివాసులు బ్యాగ్‌ను అప్పగించారు. తమ బ్యాగ్‌ను అప్పజెప్పిన ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐశ్రీనివాసులకు, బ్యాగ్‌ను నిజాయితీగా తెచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పిన సోహెల్‌బేగ్, వలి, కురువ నరసింహులుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

యువకులపై పోక్సో కేసు

గోనెగండ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వేధిస్తున్న ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. అనిల్, జాన్ అనే ఇద్దరు యువకులు కొన్ని రోజులుగా ఆదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించమంటూ వేధిస్తున్నారు. రోజురోజుకు వీరి వేధింపులు తీవ్రం కావడంతో బాలిక తన తల్లికి విషయం తెలిపింది. బాలిక తల్లి మంగళవారం గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన అనంతరం బాలికను వేధిస్తున్న యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డీపీవోగా లలితా బాయి

నంద్యాల రూరల్ జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా లలితాబాయిని నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత స్థానంలో ఇన్‌చార్జి డీపీవోగా పని చేస్తున్న నంద్యాల డీఎల్‌డీవో శివారెడ్డి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

సమన్వయంతో పనిచేయండి: ఈవో

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీశైలంలో పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా శ్రీశైలక్షేత్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భక్తులపై శ్రద్ధ చూపాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లో భక్తులకు నిరంతరం మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం అందిస్తుండాలని సిబ్బందికి సూచించారు. అన్నప్రసాద వితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేలా అన్నప్రసాద సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇంజనీరింగ్ విభాగం వారు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రమణమ్మ, ఈఈ మురళీకృష్ణ, నరసింహారెడ్డి, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైలేశుడి గిరి ప్రదక్షిణ

నంద్యాల కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో స్వామి అమ్మవార్లకు మంగళవారం వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధార మండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుంచిఅలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపై చేరుకుంది. అక్కడ నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూది మఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంది. రుద్రవనం నుంచి నంది మండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగిసింది.



నిరసన తెలుపుతున్న టీడీపీ మహిళా నాయకులు

మహిళల జోలికొస్తే ఊరుకోం

- వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి

కర్నూలు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళల జోలికొస్తే ఊరుకోమని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని కృష్ణదేవారాయల విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. మహిళా నాయకులు మాట్లాడుతూ అమరావతి వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబెట్ నిర్వహించిన జగన్ మీడియా వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియా మహిళల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. టీడీపీ నగర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జర్నలిస్టు ముసుగులో మహిళల పట్ల కించ పరిచేవిధంగా మాట్లాడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ముంతాజ్, మారుతి శర్మ, కార్పొరేటర్లు రమణమ్మ, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగతనం

- లక్ష్మీనరసింహ ఆలయంలో బంగారం, హుండీ చోరీ
- మారెమ్మవ్వ, కాశిరెడ్డినాయన ఆలయాల్లో కూడా...
- డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్‌తో తనిఖీ



చోరీకి గురైన స్వామి వారి బంగారం కళ్లు, మీసాలు

దేవనకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్ల చెలిమల (నర్మామల) గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి దొంగలుపడ్డారు. స్వామి వారి బంగారం మీసాలు, కళ్లు, భూదేవి, శ్రీదేవిల బంగారపు కళ్లు, మూడేళ్ల నుంచి హుండీలో ఉన్న సొమ్ము, ఆలాగే మారెమ్మవ్వ దేవాలయం, కాశీరెడ్డి నాయన ఆలయం, దండలు వదిలే స్వామికొండ వద్ద హుండీలు చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లిన గుడి పూజారి చంద్రయ్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వంశీనాథ్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆనంతరం కర్నూలు నుంచి ఫింగర్ ప్రింట్ క్లూస్‌టీం సభ్యులు, డాగ్ స్కాడ్‌తో పరిసరాలను పరిశీలించారు.

కరెంట్ తీగ దొంగతనం..

దేవనకొండ పరిసర ప్రాంతంలోని పొలాల్లో వ్యవసాయ మోటర్ల వద్ద వున్న కరెంట్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకెళ్లిన్నట్లు రైతులు రాజు, రమేష్, దస్తగిరి, మళ్ల బాషా తెలిపారు. ఒక్కొక్కరికి చెందిన దాదాపు రూ. 4 వేలకు పైగా విలువ చేసే వైరు కోసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



WANTED

నంద్యాల జిల్లా, బనగానపల్లెలోని నెహ్రూ హైస్కూల్ నందు పనిచేయుటకు అన్ని సబ్జెక్టులకు ట్యూటర్లు కావలెను. సంప్రదించండి. సెల్ : 95501 31444, 63020 26495, 94410 56875.
AJL-236322

ముస్లీం వివాహ సంబంధాలు

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : 87908 44959. (2వ సంబంధాలు కలవు)
AJL-236618

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 237592

PASSPORT MISSING

I, **MOHAMMED SHAFI AHMED,** S/o. MD. SHABBER AHMED, R/o.H.No:30/123-1, Chittari Street, Kurnool City, Kurnool dist, AP, i have lost my Original **Passport bearing No: L0044844,** While I was travelling from my house to One Town, Kurnool for the purpose of Xerox copies on 20.05.2025. If anyone found please inform to the above address.
AJL-236296

FOR ADVERTISEMENTS CONTACT.
Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మంత్రిని కలిసిన నాగేశ్వరరావు యాదవ్

నంద్యాల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టీడీపీ కార్యాలయంలో కర్నూలు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నంద్యాల నియోజక వర్గ టీడీపీ పరిశీలకుడు పోతురాజ్ రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్‌తో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. సమావేశంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరస్వతీ పూజ

నంద్యాల కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా నంద్యాల బొమ్మలసత్రం సాయిబాబా గుడిలో మంగళవారం పాఠశాలలో చేరే విద్యార్థులకు సరస్వతీ పూజ నిర్వహించారు. సరస్వతీ పూజ అనంతరం విద్యార్థులకు బుక్స్, పెన్స్, వాటర్‌బాటిల్ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, సాయిబాబా కమిటీ సభ్యులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

పగిడ్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పగిడ్యాలకు చెందిన రాయపు ప్రమీలమ్మ(82)అనే మహిళ ఆనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య పరామర్శించారు. మృతదేహం పై పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను ఒదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టరు రాయపు సాయి లీలా, టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, పుల్యాల రాజశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు క్రీడాకారులకు బంగారు పతకాలు

ఆత్మకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొవెలకుంట్లలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆత్మకూరుకు చెందిన క్రీడాకారులకు నాలుగు బంగారు పతకాలు వరించినట్లు ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ప్రధానంగా 33కేజీల కేటగిరిలో శివకేశవ 44కేజీల కేటగిరిలో యుగంధర్, 48కేజీల కేటగిరిలో మోహన్ కృష్ణసాయి, 55కేజీల కేటగిరిలో శ్రీమన్నారాయణ అనే నలుగురు క్రీడాకారులు అత్యుమత్తమ ప్రతిభ కనబర్చిన గోల్డ్ మెడల్స్ సాధించినట్లు చెప్పారు. వీరు ఈ నెల చివర్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో గౌరవాధ్యక్షులు సయ్యద్ అసదుల్లా, ఖోఖో శిక్షకులు మహెబూబ్ ఉన్నారు.

16న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జాబ్‌మేళా బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్(మెకానికల్) పూర్తిచేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 7673902328, 9154830286 నంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి తదితరులు ఉన్నారు.

టీషర్టుల పంపిణీ

పాములపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో కబడ్డీ క్రీడకారులకు మండల టీడీపీ నాయకులు తెలుగు యువత అధ్యక్షులు మధుక్రిష్ణ ఉచితంగా టీషర్టులు పంపిణీ చేశారు. గ్రామంలో ముక్కంటి నూతన ఈశ్వరాలయం, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో క్రీడాకారులకు, రూ 10వేలు విలువగల 14 జతల టీ షర్టులను అందజే శారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గ్రామ సర్పంచ్ రామస్వామి, రామక్రిష్ణ, బషీరు, హఫీజ్, మధు, రవి, దస్తగిరి, గోపాల్, మహేశ్వరరావు, పాల్గొన్నారు

PUBLIC NOTICE

This is to inform to the general public that one **Boya Madhu, S/o Boya Maddileti**, residing at H.No.2-8, Muchumarri Village, Pagidyala (M), Nandyal District, has obtained Regd.Settlement Deed Doc. 7681/2022 from his mother Boya Nageswaramma, W/o. Boya Maddileti, Muchumarri Village, Pagidyala (M), Nandyal district. Again he obtained a Regd. Rectification Deed Doc. No. 6798/2023 for above said Gift Settlement deed from his mother Boya Nageswa ramma. Now the above said Boya Madhu wants to take Mortgage Loan from My Client, **Indusind Bank Ltd.**, Kurnool Branch by mortgaging below mentioned schedule house. Hence, if anybody has any objections regarding the below mentioned schedule house. Please inform the below mentioned address or Cell Number with in 07 days from the date of this publication. Otherwise, it would be deemed that there are no claims regarding the said property.

SCHEDULE

Nandyal District, Nandikotkur Sub District, Pagidyala Mandal. Muchumarri Grama Panchayat are limits in Sy. No. 626/2 of Pata Muchumarri Village the H.No: 2-8 and Open site.

BOUNDARIES:
East: Land of Byreddy Rajasekhar Reddy, **West:** House of Sivanna, **North:** Road, **South:** House of Talari Venkatanna
Measurements: East-West: 34.5 Feet, North-South: 20.7 Feet.
Total Extent: 79.35 Sq. Yards.

K.VENKATESWARLU,
ADVOCATE,
D.No.40-837-C, Near SBI Main Branch, KURNOOL, CELLNo: **9440245022**

డంప్.. కంపు!

నందికొట్కూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాల్టీలో జనావాసాల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డు కంపుకొడుతోంది. గాలి వీచినప్పుడల్లా, సమీప కాలనీలను చెత్త ముంచెత్తుతోంది. డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో ఆ పొగ కాలనీలను కమ్మేస్తోంది. ఓ వైపు వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసనతోనూ, పొగతోనూ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా తరలించాలని కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అనారోగ్యాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి డంప్‌యార్డును వేరే చోటకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- కాలనీలకు సమీపంలో డంపింగ్ యార్డు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

● మున్సిపాల్టీలో 16 వేల గృహాలు ఉన్నాయి. 63 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. పట్టణం నుంచి పారిశుధ్య కార్మికులు రోజూ 22 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. దీన్ని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డునే నేటికీ కొనసాగిస్తున్నారు. పట్టణ జనాభా పెరగడంతో దీని చుట్టూ కాలనీలు విస్తరించాయి. యార్డు చుట్టూ ఇంటి నిర్మాణాలు పెరిగాయి. డంపింగ్ యార్డును తరలిస్తామని పాలకవర్గం ప్రచారం చేయడంతో దీని చుట్టూ ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు.



డంపింగ్ యార్డులోని చెత్తను అంటించిన దృశ్యం

ఐదు కాలనీ వాసుల అవస్థలు

డంపింగ్ యార్డు సమీపాన కుమ్మరిపేట, ఇందిరమ్మకాలనీ, బైరెడ్డినగర్, సంగయ్యపేట, సీఎస్ఐ పాలెం, కాలనీలు ఉన్నాయి. వీటి పరిధిలోని సుమారు 15 వేల మంది నివసిస్తున్నారు. ఈ డంపింగ్ యార్డును బిజినవేముల సమీపంలోని ప్రభుత్వ స్థలంలోకి మార్చేందుకు పాలక వర్గం, పురపాలక, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బిజినవేముల గ్రామస్థులు అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇంత వరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించకపోవడంతో పట్టణ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.



చోటులేక పాట్లు

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించకుండా అంతా కలిపి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. దీంతో తడిచెత్త కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. యార్డు మొత్తం చెత్తతో నిండిపోవడంతో కొత్తగా వ్యర్థాలు వేసే చోటు లేదు. చెత్త వాహనాలు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో చెత్తను బయటే వదిలేస్తున్నారు. అందులోని పొడిచెత్త, కవర్లు గాలికి కాలనీల్లోకి కొట్టుకొస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొగతో నిండిపోయిన దృశ్యం

మున్సిపాలిటీ నుంచి నివేదికలు రాలేదు..

గతంలో నందికొట్కూరు మండలం మద్దిగట్ల పొలిమెరలో డంప్ యార్డు కోసం స్థల సేకరణ చేశారు. అయితే రైతులు అడ్డుకోవడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి నివేదికలు రాలేదు. ఒక వేళ భూమి కావాలని మున్సిపల్ అధికారులు కోరితే ప్రభుత్వ స్థలం ఉంటే చూపిస్తాం.

శ్రీనివాసులు, నందికొట్కూరు తహసీల్దార్

విధ్వంసం నుంచి వికాసం దిశగా

- మొదటి సంవత్సరంలోనే అభివృద్ధి వైపు అడుగులు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 2019 నుంచి 2024 వరకు విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి కలిగిస్తూ వికాసం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య అన్నారు. నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సీఎంఆర్ చెక్కుల పంపిణీ తదితర వాటిపై మొదటి సంవత్సరం దృష్టి సారించామన్నారు.ప్రతి మండలంలో రూ.రూ.2.40 కోట్లతో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దుద్యాల గ్రామంలో బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం

2019 ఎన్నికల ప్రచారంలో కొణిదేల గ్రామానికి వచ్చిన పవన్‌కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా కొణిదెలకు వచ్చిన పవన్ కళ్యాణ్ తన ఇంటి పేరుతో ఉన్న గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నేడు నిలబెట్టుకున్నారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తన సొంత ట్రస్టు ద్వారా రూ.50 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. నిధులను మంజూరు చేసిన పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్‌గా రాజు



ఆత్మకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్‌గా యు.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఫైర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న భీముడునాయక్ ఆళ్లగడ్డ అగ్నిమాపక కేంద్రానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనంతపురం జిల్లా ధర్మవరం ఫైర్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న యు.రాజు ఇక్కడికి రావడం జరిగింది.

మహిళలను కించపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు మోమిన్ షబానా, టీడీపీ మహిళా విభాగం నాయకురాలు ఉమాదేవీ, సరోజ, వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆతర్వాత వారు అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం, కేజీ రోడ్డు మీదుగా గౌడుసెంటర్ వరకు ర్యాలీగా తరలివచ్చారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రిన్సిపాల్‌గా సుంకన్న బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుంకన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రఘురామాచార్యులు సాధారణ బదిలీల్లో భాగంగా నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ కావడం జరిగింది. దీంతో కర్నూలు టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుంకన్న ఆత్మకూరుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ తనిఖీలు

నందికొట్కూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథం నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మంగళవారం సాధారణ తనిఖీల్లో భాగంగా నందికొట్కూరు మున్సిపాల్టీ కార్యాలయాన్ని ఆర్.డీ తనిఖీచేశారు. మధ్యాహ్నం నుంచి ముగ్గురు సిబ్బంది మున్సిపాల్ కార్యాలయంలోని ఆయా విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే నందికొట్కూరుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యాక్రమంలో కమీషనర్ బేబి, కౌన్సిలర్ చాంద్‌బాషా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబికా అమ్మవారికి మంగళవారం పౌర్ణమి సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి అనంతరం లోక కళ్యాణార్థం లక్ష కుంకుమార్చనపూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ఉయాల సేవ నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో కొలువై వున్న సుబ్రమణ్యేశ్వరస్వామికి పాలు, పెరుగు, తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్లు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అలాగే నందీశ్వరస్వామికి అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు.

మహిళలందరూ అక్షరాస్యత సాధించాలి

పాణ్యం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ అక్షరాస్యత సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వు బ్యాంకు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పొదుపు భవనంలో పొదుపు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లోని సభ్యులు తమ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకోవడానికి అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లించాలన్నారు. మండలంలో 1138 సంఘాలు ఉన్నాయని ఏపీఎం ప్రసాద్ తెలిపారు. మహిళలు ఆర్థిక క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ మేనేజరు రామకృష్ణ, ఎల్‌డీఎం రవీంద్రప్రసాద్, ఎస్‌బీఐ మేనేజరు జగదీశ్వర్, ఏపిజిబి మేనేజరు సురేష్‌కుమార్ రెడ్డి, వెలుగు సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆకతాయిలతో జాగ్రత్త: సీఐ

నంద్యాల హాస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ జయరామ్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణా శిబిరంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా చదువుకుంటున్న అమ్మాయిలు కళాశాల పరిసరాల్లో రోడ్లపైన ఆకతాయిలు ఆటపట్టిస్తే వెంటనే మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర మాసంలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్లకు కళాశాల అధ్యాపకురాలు డా.లలితాసరస్వతి యోగాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరామ్

ఎస్ఎఫ్ఐ నిరసన

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌లు, పుస్తకాల విక్రయం జరుగుతుందంటూ ఎన్జీవోస్ కాలనీలోని ప్రైవేట్ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. విద్యార్థుల నుంచి ఫీజులు, పుస్తకాల పేరుతో వేలకు వేలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, స్కూలు వద్దనే కౌంటర్‌లను ఏర్పాటుచేసి నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా, ఎంఆర్.నాయక్, సాయి, రోహిత్, యశ్వంత్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మహానంది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపితే చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ తెలిపారు.మంగళవారం మహానంది మండలం అబ్బీపురం, తిమ్మాపురం గ్రామాల్లో మండల సూపర్‌వైజర్ తోట కవిత, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి ఆధ్వర్యంలో కిషోర వికాసం వేసవి సెలవుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల సూపర్‌వైజర్ కుమారి, టీడీపీ నాయకుడు దస్తగిరి, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రకాంత్ డిజిటల్ అసిస్టెంట్ జహీర్, కార్యదర్శి దివ్య పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

కొత్తపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి గురువారం వస్తున్న ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఎం.పి.మద్దిలేటి కోరారు. మంగళవారం ఆయన కొత్తపల్లిలో మాట్లాడారు. నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వైఎస్ షర్మిల రానున్నారని చెప్పారు. కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మున్సిపాల్టీలోని సమస్యలను పరిష్కరించాలి

మున్సిపాల్టీలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథంకు సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యమున్సిపాల్టీలోని జగనన్న కాలనీ, కర్నూల్ రోడ్డు బీఆర్ఆర్ నగర్, సీపీఎం కొట్టాల్లో రోడ్లు, విద్యుత్, నీటి వసతి లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. మార్కెట్‌యార్డు నుంచి ఆత్మకూరు రోడ్డులోని జమ్మిచెట్టు వరకు రోడ్డు విస్తరణ పనులు చేప్టి డివైడర్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రించాలని డిమాండ్ చేశారు. క్రమంలో గోపాలకృష్ణ, ఉస్మాన్‌భాష, రామసుబ్బయ్యలు పాల్గొన్నారు.



రీజనల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బాక్సింగ్‌లో నంద్యాల క్రీడాకారులకు 11పతకాలు

నంద్యాల హాస్పిటల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ లో నంద్యాల పట్టణ క్రీడాకారులు 11పతకాలు సాధించినట్లు శిక్షకులు సర్దార్, షా నవాజ్‌ఖాన్‌లు తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన మంజునాథ్, చిన్నలాల్‌లు బంగారు పతకాలు సాధించగా శశిధర్‌రెడ్డి, తన్వీర్, ప్రణీత్, ప్రణతిసాయిలు వెండిపతకాలు సాధించారన్నారు. అజయ్‌రాజు, నవనీత్, మణికంఠ, మహిధర్‌లు బ్రాంజ్‌మెడల్స్ సాధించారన్నారు. నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరుతేవాలని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌బాషా, ఫయాజుద్దీన్‌లు అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరిరమేష్ పాల్గొన్నారు.



సమయ పాలన ఏది?

● తహసీల్దార్ కోసం ప్రజల ఎదురు చూపులు


తహసీల్దార్ కోసం వేచిఉన్న రైతులు, విద్యార్థిని

చాగలమర్రి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలు, రైతులకు ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం ఉదయం 10గంటలకు రావాల్సిన తహసీల్దార్ మధ్యాహ్నం వరకు రాలేదు. సమస్యలు తెలుపుకోవడానికి వచ్చిన రైతులు, కుల, ఆదాయ ధృవపత్రాల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు మధ్యాహ్నం వరకు కార్యాలయం వద్ద నిరీక్షించారు. కొందరు వచ్చిన దారిలోనే వెళ్లిపోయారు. అయితే మధ్యాహ్నం 1.20 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి తహసీల్దార్‌ను వివరణ కోరగా భూసర్వే పనులపై క్షేత్రస్థాయికి వెళ్లినట్లు తెలిపారు.

'పది' విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించిన దూదెకుల సంఘం నాయకులు

చాగలమర్రి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో దూదెకుల కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులను కమిటీ గౌరవ అధ్యక్షుడు రంగయ్య, అధ్యక్షుడు లాలయ్య, కార్యదర్శి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో అందజేశారు. మొదటి బహుమతి షఫీవుల్లాకు రూ.5 వేలు, రెండో బహుమతి సింధూరికి రూ.4 వేలు, మూడవ బహుమతి యశ్వంత్‌కు రూ.3 వేలు, నాల్గో బహుమతి కె.బీబీకి రూ.2 వేలు, ఐదో బహుమతి ఉసేన్‌బీకి రూ.1,000 దాతలు పాపయ్య, ఇమామ్, రంగయ్య, దస్తగిరి, ఖాసీం అందజేశారు. అనంతరం విద్యార్థులను సన్మానించి మెమొంటోలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దూదెకుల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాబన్, జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, ఉపాధ్యక్షుడు ఖాసీంవలి, కడప జిల్లా దూదెకుల సంఘ నాయకులు మూనూర్, అక్బర్, బాబయ్య, బషీర్, ఇమామ్, నాగశేషు, చిన్నపీరయ్య, బాష, బాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు మంజూరు

కొలిమిగుండ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి నూతనంగా ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి మంగళవారం వెల్లడించారు. ఈ నెల 12న నూతన పింఛన్ లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అంకిరెడ్డిపల్లె కు 5, బెలుం 9, బి. ఉప్పలూరు 8, చింతలాయపల్లె 6, గొర్విమానుపల్లె 11, కమ్మవారిపల్లె 9, కనకాద్రిపల్లె 15, కొలిమిగుండ్ల 5, నందిపాడు 8, పెట్నికోట 4, తిమ్మనాయినిపేట 7, తుమ్మలపెంట 1, తోళ్లమడుగుకు 1 మంజూరైనట్లు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి పల్లకీసేవ

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల మూర్తికి విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తికి అలంకరణ చేసి పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరస్వామి

సంజామల,జూన్ 10(ఆంధ్రజ్యోతి): నొస్సం గ్రామంలో వెలిసిన బుగ్గ వేంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈవో చంద్రుడు, ధర్మకర్త బాల మద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు.

9వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

బేతంచెర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల రిలే దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరాయి. మంగళవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీఎన్‌టీయూసీ నాయకులు రమణ, మండల అధ్యక్షుడు నలేంద్ర శ్రీనివాసులు, బీజేపీ అధ్యక్షుడు మహారాజ్, అడ్వకేట్ హరూన్, మాజీ కౌన్సిలర్ బాషా కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరగకపోతే కంపెనీ గేటు వద్ద, మాజీ మంత్రి బుగ్గన ఇంటి ముందు టెంటు వేసి దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కార్మికులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఎన్‌బీకే ఫ్యాన్స్ మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. డోన్ ఎన్‌బీకే ఫ్యాన్స్ నగేష్, అన్నమయ్య, మధు, టీస్టాల్ కాశీం, రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమప్ప, ఖాజా, హుశేన్, నూరి, అయ్యస్వామి పాల్గొన్నారు.

మృత్యు మలుపులు

● కనిపించని సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు


హుసేనాపురం నుంచి కొమ్మెమర్రి రోడ్డు మార్గంలోని మలుపు

ప్యాపిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం గ్రామం నుంచి కొండమీది గ్రామాలైన కొమ్మెమర్రి, నేరేడుచెర్ల, రాచెర్ల, బూరుగులకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి వెంట మూడు నాలుగు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీనివల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కనబడవు. అధికారులు మలుపుల దగ్గర ఎటువంటి సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు, బైకులు ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తుంటాయి. ప్రమాదకరంగా మారిన మలుపుల దగ్గర ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల స్పందించి మలుపుల దగ్గర సూచిక బోర్డులు, స్పీడ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

గోదాముల నిర్మాణానికి మోక్షం

- వైపీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- 'కూటమి'లో పనులు పునఃప్రారంభం
- త్వరలో అందుబాటులోకి..


మార్కెట్‌యార్డులో జరుగుతున్న గోదాము పనులు

బనగాన పల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డులో ప్రభుత్వ గోదాముల నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఎనిమిదేళ్ల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దాంతో రైతులు ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో దాచుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అర్థాంతరంగా నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. త్వరలో గోదాములు అందుబాటులో రానున్నాయి. పట్టణంలో మార్కెట్‌యార్డును 1997లో 24 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఒక్క గోదాములో కేవలం 365 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే రైతులు నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉన్నది. ఈ గోదాము రైతులకు ఏ మాత్రం సరిపోయేది కాదు. అయితే 2018లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రూ.1.10కోట్లతో మార్కెట్ యార్డులో రెండు గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఒక్కో గోదాములో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునేలా నిర్మాణం చేపట్టారు. గోదాముల నిర్మాణ పనులు 2018లో ప్రారంభమయ్యాయి. 2019 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో అర్థాంతరంగా గోదాముల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

మంత్రి బీసీ చొరవతో పనులు

గత వైసీపీ హయాంలో బిల్లులు రాకపోవడంతో పూర్తిగా నిలిచిపోయిన మార్కెట్ యార్డు గోదాము పనులపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టి సారించారు. మంత్రి చొరవతో రీటెండర్లు వేయించారు. కాంట్రాక్టర్లు మార్కెట్‌యార్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. గోదాముల్లో పేరుకుపోయిన ముళ్ల కంపలను తొలగించారు. త్వరలో గోదాముల నిర్మాణ పనులు పూర్తయి రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి


పెట్రోల్‌బంక్ సమీపంలో మహిళల మానవహారం

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిపై దుష్ప్రచారం చేస్తూ, అమరావతి మహిళలను కించపరిచిన జగన్ మీడియా క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో మహిళలు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి పెట్రోల్‌బంకు కూడలిలో నిరసన వ్యక్తం చేసి అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మహిళలు మాట్లాడుతూ అమరావతిలో ఉన్న బీసీ, ఎస్సీలను అవమానించి ప్రముఖ బౌద్ధక్షేత్రంపై దాడి చేయించినందుకు జగన్ క్షమాపణ చెప్పాలన్నారు. కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు దిగజారుడు రాజకీయాలు జగన్ చేస్తున్నారని ఆరోపించారు.

బేతంచెర్ల: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసులు, కృష్ణంరాజును కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం పాతబస్టాండు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, కించపరిచే విధంగా మాట్లాడిన జగన్ మీడియాపైన కూడా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ రమేస్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ముందు వారి చిత్రపటాలను దహనం చేశారు. ధర్నాలో మహిళా సంఘాల నాయకులు, స్థానిక మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

● మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ● కైపలో పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కైప గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతగా పనులు చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. గత వైసీపీ హయాంలో అధ్వానంగా ఉన్న రోడ్లను పూడ్చి గుంతలులేని రోడ్లుగా తీర్చిదిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి వైపు పయనించేలా కృషి చేస్తున్నారన్నారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి అన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి

దొర్నిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ దేవర సందర్భంగా మంగళవారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను టీడీపీ యువనాయకుడు భూమా జగత్‌విఖ్యాతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దివంగత భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిల జ్ఞాపకార్థం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతుల ఆధ్వర్యంలో టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి కమిటీ సభ్యులకు మొదటి బహుమతిగా రూ.1.50 లక్షలు అందజేశారు. సీనియర్ క్యాటగిరి వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.1.50 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడవ బహుమతి రూ.75 వేలు, నాల్గో బహుమతి రూ.50 వేలు, ఐదోబహుమతి రూ.40వేలు, న్యూక్యాటగిరి విభాగంలో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.25వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొందరు నకిలీ విత్తనాలు ప్యాకింగ్ చేసి రైతులకు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వేసి దిగుబడిరాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు అన్యాయం జరగకుండా నకిలీవిత్తనాలు తయారు చేసి విక్రయించేవారిపై చర్యలు తీ సుకోవాలని, ఆ షాపుల లైసెన్సులు రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శివరామిరెడ్డి, నా యకులు బాలరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

గిట్టుబాటు లేక బొప్పాయి చెట్ల నరికివేత


ఆలమూరులో బొప్పాయి తోట నరికిన దృశ్యం

రుద్రవరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన హుసేన్ అనే రైతు మంగళవారం బొప్పాయితోటను నరికివేశాడు. బొప్పాయి పండ్లు టన్ను రూ.3వేల నుంచి రూ.4వేలు పలికింది. కోత కూలీ కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తోట నరికివేసినట్లు బాధిత రైతు వాపోయాడు. మరో పంట సాగు చేస్తానన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటు ప్రోగ్రాం (యూఎన్ఈపీ)లో భాగంగా మంగళవారం పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో చైర్మన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించుకోవాలన్నారు. మొక్కల ద్వారానే మానవుడి మనుగడ సాధ్యమన్నారు. విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి


దొరపల్లె లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, బాలికలు

డోన్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం అన్నారు. మండలంలోని దొరపల్లె గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలికల వికాసం ర్యాలీని నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలతో స్నేహభావంగా ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శోభారాణి, అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ టీడీపీ నాయకులు బంకు శ్రీను, మెట్ట నాగరాజు, మిట్ట నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాసవీ జూనియర్ కళాశాలలో..

చాగలమర్రి: కిషోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి తెలిపారు. మంగళవారం వాసవీ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోరి వికాసం వేసవికాల ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్వర్‌బాషా, టీడీపీ నాయకులు మౌలాలి, కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ విష్ణుప్రియ, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డోన్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తారని టీడీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు సంబంధించి పలు అభివృద్ధి పనులకు, ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు చేస్తారన్నారు. ఉడుములపాడు, ప్యాపిలి మండలం చిన్న పొదెళ్ల, గార్లదిన్నె గ్రామాల్లో అభివృద్ధి పనులకు, బేతంచెర్ల మండలం సిమెంటునగర్-రామతీర్థం గ్రామాల మధ్య రోడ్డు, అలాగే డోన్ పట్టణంలో నెహ్రూనగర్‌లో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● గిరిజన సంఘాల డిమాండ్

డోన్ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడిప్పుడే గిరిజనులు చదువులో రాణిస్తున్నారన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎరుకుల గోపాల్, ఎన్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి గాలేటి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు వెంకటేశ్, సుగాలి సేవా నాయకుడు తన్మయ్ పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వెలసిన రామస్వామి, ఈశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన 69.2 ఎకరాల భూములకు ఈ నెల 12న బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో బీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఏడాది కాలపరిమితికి వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయాలకు పాత బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులన్నారు.

కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచాలి

ప్యాపిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సీట్ల సంఖ్య పెంచాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షులు బీవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అధికంగా ఉన్నాయన్నారు. పాఠశాలలో సీటు రాకపోవడంతో పిల్లల చదువులు దెబ్బతింటున్నాయన్నారు. అలాగే కేజీబీవీలో స్థానిక విద్యార్థునులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుమానుపల్లె సమీపంలోని గుండం అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో నూతన పట్టాభిరామ ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గ్రామపెద్దలు, దాతల సహకారంతో ప్రత్యేక శిల్ప, మందిర నిర్మాణ శిల్పులతో పనులు చేపడుతున్నారు. ఇప్పటికే గర్భగుడి నిర్మాణం, అంతరాలయం నిర్మాణ పనులు పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. వచ్చే శ్రీరామనవమి నాటికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రారంభిస్తామన్నారు.

సోలార్ రాయితీపై అవగాహన కల్పించాలి

బేతంచెర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సోలార్ రాయితీపై అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ డోన్ డీఈ కమలాకర్‌రావు సూచించారు. మంగళవారం పట్టణంలోని రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాలులో విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన విద్యుత్ సిబ్బందికి సోలార్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ వినియోగంపై విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. సోలార్ ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యపరుచాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ ఏఈలు పుల్లయ్య, శ్రీనివాసులు విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

నేడు యాగంటిపల్లెలో పెద్దమ్మ జాతర

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యాగంటిపల్లెలో మంగళవారం పెద్దమ్మ జాతరను నిర్వహించడానికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. 40 ఏళ్ల తర్వాత గ్రామంలో పెద్దమ్మ జాతరను నిర్వహిస్తుండడంతో బంధువులతో యాగంటిపల్లె కిటకిటలాడుతోంది. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ , సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. జాతర ప్రశాంతంగా జరుగడానికి గ్రామస్థులు సహకరించాలని సీఐలు కోరారు

విద్యార్థినికి సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్స్ 2025 పురస్కారం అందుకున్న మోడల్‌స్కూల్ విద్యార్థిని గరుడ జమిమాను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ మంత్రి క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త ధనలక్ష్మి

బేతంచెర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు హెడ్. డాక్టర్ ధనలక్ష్మి సూచించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ద్వారా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమా న్ని మంగళవారం మండలంలోని ముద్దవరం, సీతారామాపురం, గోరుమానుకొండ గ్రామాల్లో నిర్వహించారు. ముద్దవరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సైంటిస్టు హెడ్.డా.ధనలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణమూర్తి, ఆదినారాయణ పాల్గొని ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలను వివరించారు. భూసార ఆధారిత ఎరువుల యజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన కరువు మోతాదును వివరించారు. సమావేశంలో ఏఈవోలు, వీఏఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపు తనిఖీ

ఉయ్యాలవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో నిర్వహించిన ఆధార్ క్యాంపును ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బందితో సమావేశమై విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. యోగాంధ్రపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.